క్లుప్తంగా

నేడు మహా కుంభాభిషేకం



సామర్లకోటలో నూకాలమ్మ అమ్మవారు

సామర్లకోట: పట్టణంలోని స్టేషన్ సెంటర్‌లో వేంచేసి ఉన్న నూకాలమ్మ ఆలయంలో అమ్మవారికి మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, కొత్త అమావాస్యను పురస్కరించుకుని ఆలయంలో నెల రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. పౌర్ణమి సందర్భంగా 108 మంది మహిళలతో ఊరేగింపుగా గోదావరి కాలువకు బిందెలతో నీళ్లు తెచ్చి అభిషేకం చేస్తారని తెలిపారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



బంగారు, వెండి పుష్పాలతో పూజలందుకుంటున్న అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమం జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం



సామర్లకోట మాండవ్య నారాయణస్వామి గ్రామోత్సవం

సామర్లకోట: తుల్యభాగ గోదావరి నదీ తీరాన స్థానిక భీమవరం వద్ద ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత మాండవ్యనారాయణ స్వామి గ్రామోత్సవం శుక్రవారం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. కల్యాణ ఉత్సవాల్లో భాగంగా నిత్యం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఆలయం నుంచి గ్రామోత్సవం ప్రారంభమైంది. ఆలయం నుంచి గోదావరి కాలువపై ఉన్న కాలిబాట వంతెన, ఫ్లై ఓవర్ బ్రిడ్జి, స్టేషన్ సెంటర్ మీదుగా వివిధ ప్రాంతాల్లో కొనసాగిన గ్రామోత్సవం చివరకు ఆలయానికి చేరింది. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. శనివారం ప్రత్యేక పూజలు, పూర్ణాహుతి ఉంటాయని ఈఓ బిక్కిన వెంకట్రాయ చౌదరి తెలిపారు.

ఘనంగా శ్రీపుష్పయాగం

కొత్తపల్లి: సీతారాముల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా వాకతిప్ప శాలివాహన పద్మశాలీయ రామాలయం వద్ద గురువారం రాత్రి స్వామివారికి ఘనంగా శ్రీపుష్పయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను ఊయలలో ఉంచి అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా సీతారాముని రథోత్సవం



నాగులాపల్లిలో జరిగిన రథోత్సవం

కొత్తపల్లి: నాగులాపల్లిలో ఉన్న సీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా శుక్రవారం రాత్రి ఘనంగా రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. బ్యాండ్ మేళాలు, విద్యుద్దీపాలంకరణ, బాణసంచా పేలుళ్లతో రథోత్సవం గ్రామ వీధుల్లో కొనసాగింది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

గ్రామసింహ గర్జన



గుంపులుగా తిరుగుతున్న గ్రామ సింహాలు

- పెరిగిపోతున్న కుక్కకాటు కేసులు
- ప్రాణాపాయ స్థితిలో బాధితుల బెంబేలు
- రోజురోజుకూ దిగజారుతున్న పరిస్థితి
- తూతూమంత్రంగా అధికారుల నియంత్రణ చర్యలు



గొల్లప్రోలులో ఆపరేషన్లు చేయడానికి కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది

పిఠాపురం: పట్టణాలు, మారుమూల ప్రాంతాలనే తేడా లేకుండా గ్రామ సింహాలు గర్జిస్తున్నాయి. దొరికిన వారందరిపైనా దాడులు చేస్తున్నాయి. ఫలితంగా అనేక మంది కుక్కకాటుకు గురై ప్రాణాపాయంతో వైద్యం కోసం ఎదురుచూస్తున్నారు. స్థానిక పీహెచ్‌సీలో యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్(ఏఆర్వీ) అరకొరగా ఉండగా, కుక్కల నియంత్రణ చర్యలు మాత్రం కానరావడం లేదు. ప్రాణాంతకమైన ర్యాబిస్ వ్యాధి కారకాలైన కుక్కల నియంత్రణ చర్యలపై దృష్టి సారించకుండా కేవలం ఏఆర్వీతో సరిపెట్టేందుకు యత్నిస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గ పరిధిలో పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల్లో కుక్కల బెడద రోజురోజుకూ పెరిగిపోతోంది. వివిధ ప్రాంతాల్లో అనేక మంది కుక్కకాటుకు గురై మృత్యువాత పడగా, హడావుడి చేసిన అధికారులు మళ్లీ పట్టించుకోవడం మానేశారు. దీంతో నిత్యం కుక్కకాటుకు గురయ్యే వారి సంఖ్య అధికమవుతోంది.

ఏఆర్వీ కొరత!

నియోజకవర్గ పరిధిలో ప్రతిరోజూ 35కు పైగా కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయి. పిఠాపురంలోని సీహెచ్‌సీ, కొత్తపల్లి, విరవ, గొల్లప్రోలు, కొమరగిరి, పీహెచ్‌సీల్లో ఏఆర్వీ కొరత కలవరపెడుతుంటే, కుక్కకాటుకు గురైన వారి సంఖ్య మాత్రం ఆందోళనకు గురిచేస్తోంది. ప్రభుత్వాస్పత్రుల్లో ఇంజెక్షన్లు సక్రమంగా లభ్యంకాక కొందరు ప్రైవేటు హాస్పిటళ్లను ఆశ్రయించాల్సి వస్తోందని గ్రామస్తులు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో కేవలం సలహాలివ్వడమే మినహా వైద్య సేవలు అందడం లేదని బాధితులు వాపోతున్నారు.

నియోజకవర్గంలో పరిస్థితి ఇలా..

సీహెచ్‌సీ	1
యూపీహెచ్‌సీలు	3
పీహెచ్‌సీలు	7
వీధి కుక్కలు	34 వేలు
కుక్కకాటు కేసులు	నెలకు 300కు పైగా

దాడులపై ఆందోళన

ఏడాదిగా పిఠాపురం నియోజకవర్గంలో సుమారు 50 గేదె పెయ్య దూడలు కుక్కకాటు వల్ల చనిపోయినట్లు రైతులు చెబుతున్నారు. ఒక్క గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో విలువైన 20 గేదె దూడలపై దాడి చేసి హతమార్చినట్లు స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో వందల సంఖ్యలో కుక్కలు స్వైరవిహారం చేస్తూ, చిన్న పిల్లలపై దాడులు చేస్తూండడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. పిఠాపురం మున్సిపాలిటీలో 3 వేలకు పైగా కుక్కలున్నాయంటే అవి ఏ మేరకు పెరిగిపోయాయో అవగతమవుతుంది.

పెరిగిన సంతతి

ఆపరేషన్లు చేస్తే కుక్కల సంతతి వృద్ధి చెందదు మినహా, వాటి దాడులు ఆగే పరిస్థితి కానరావడం లేదు. ఒకవేళ కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయాలంటే ముందుగా వాటిని బంధించడానికి బోనులు ఏర్పాటు చేయాలి. ఒక్కో బోనులో ఐదు కుక్కలను మాత్రమే తీసుకెళ్లి ఆపరేషన్ చేసేందుకు వీలుంటుంది. ఆపరేషన్ పూర్తయ్యాక ఐదు రోజుల వరకు వాటి బాగోగులు చూడాలి అవసరమైన వైద్య సేవలందించాలి. అప్పటి వరకు ఆ కుక్కలను బోనులోనే ఉంచాలి. అప్పటివరకు బోనులు ఖాళీ కాకపోతే, గ్రామాల్లో వందల సంఖ్యలో ఉన్న కుక్కలకు ఆపరేషన్లు పూర్తి కావాలంటే కొన్ని నెలలు పడుతుంది. ఇంతలో మళ్లీ సంతానోత్పత్తి చేస్తే నాలుగు రెట్ల కుక్కలు పెరగవచ్చని అంటున్నారు. గొల్లప్రోలులో కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేపట్టగా, నెల రోజుల్లో 30 కూడా చేయలేకపోయారు.

వీధి కుక్కలకు ఆపరేషన్లు

> గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో విచ్చలవిడిగా తిరుగుతున్న వీధి కుక్కలకు సంతానోత్పత్తి నిరోధించే ఆపరేషన్లు చేస్తున్నారు. కాకినాడకు చెందిన సొసైటీ ఫర్ నేచర్ అండ్ యానిమల్ ప్రొటెక్షన్ (స్నాప్) ఆధ్వర్యంలో యానిమల్ బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు చేయిస్తున్నాం. గొల్లప్రోలు నగర పంచాయతీలో 20 వీధి కుక్కలను పట్టుకుని కాకినాడ కార్పొరేషన్ ఏబీసీ సెంటర్‌కు తరలించారు. వీధి కుక్కల వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నాం.
>
> – ఎస్ కనకారావు, కమిషనర్, గొల్లప్రోలు నగర పంచాయతీ

కొన్నేళ్లుగా చర్యలు నిల్!

శునకాలకు కుటుంబ నియంత్రణ చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు. అయినా ప్రతి గ్రామంలో శునకాల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఏ వీధి చూసినా కుక్కలే కనిపిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో పిచ్చి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. కుక్కలను సంహరించరాదన్న నిబంధనలు ఉండడంతో. కొన్నేళ్లుగా కుక్కల నియంత్రణ చర్యలు తీసుకోకపోవడం వల్ల వాటి సంతతి వృద్ధి చెందింది. ఎక్కడ చూసినా గుంపులుగా కనిపిస్తున్నాయి. కనిపించిన వారిపైన దాడికి దిగుతున్నాయి. అయినప్పటికీ స్థానిక మున్సిపాలిటీ, పంచాయతీలు కుక్కల నివారణకు ఏ విధమైన చర్యలు చేపట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గ్రీవెన్స్ రద్దు

పిఠాపురం: డా బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని పిఠాపురం పాడా కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు సంస్థ పీడీ ఎ.చైత్రవర్షిణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు అయినందున గ్రీవెన్స్ రద్దు చేసినట్టు చెప్పారు.

విద్యార్థుల చేరికకు ప్రత్యేక డ్రైవ్



పాఠశాలలో చేరికకు అనుమతి పత్రం ఇస్తున్న హెచ్‌ఎం

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నాయని బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. ఐదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులను హైస్కూల్‌లో చేర్చేలా శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం, ఉచిత విద్య, నాణ్యమైన భోజనం, యూనిఫారం, పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీని తల్లిదండ్రులకు వివరించారు. పాఠశాలలో క్రీడామైదానాలు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, స్వచ్ఛమైన తాగునీరు, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు వంటివి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. హెచ్‌ఎం వెంట పలువురు ఉపాధ్యాయులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



రాగంపేటలో ఉపాధి హామీపై ఆరా తీస్తున్న పద్మజ

పెద్దాపురం: రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికి కేంద్రం కృషి చేస్తుందని ఏపీ రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తుమ్మల పద్మజ అన్నారు. మండలంలోని జి.రాగంపేట గ్రామంలో శుక్రవారం పల్లెకు పోదాం, రచ్చబండ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం అమలు తీరు, సచివాలయ సేవలు, ఐసీడీఎస్ సేవలపై ఆరా తీశారు. పులిమేరు పీహెచ్‌సీని పరిశీలించారు.

బొండు ఇసుక అక్రమ తవ్వకాలు!



రమణక్కపేటలో అక్రమ తవ్వకాలు చేపట్టిన ప్రాంతం

కొత్తపల్లి: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోని కొత్తపల్లి మండలం రమణక్కపేటలో బొండు ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా గుట్టుచప్పుడు కాకుండా బొండు ఇసుక వ్యాపారం జోరుగా సాగిస్తున్నా, సంబంధిత అధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు కూటమి నాయకులు అధికారులకు మామూళ్లు ముట్టజెప్పి, భయపెట్టి ఇసుకదందాకు పాల్పడుతున్నారని చర్చించుకుంటున్నారు. రాత్రివేళ అక్రమ రవాణా మరింత జోరుగా సాగుతోంది. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణను వివరణ కోరగా, బొండు ఇసుక తవ్వకాలకు శాఖా పరంగా ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని చెప్పారు. స్థానిక రెవెన్యూ అధికారులను పంపి, తవ్వకాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ర్యాలీ



పెద్దాపురంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న ముస్లిం ప్రతినిధులు

మున్సిపల్ సెంటర్ వద్ద మానవహారం

పెద్దాపురం: వక్ఫ్ సవరణ బిల్లు–2025కు వ్యతిరేకంగా పెద్దాపురం పట్టణ ముస్లింలు శుక్రవారం నిరసన ర్యాలీ చేపట్టారు. జమ్మా సమాజ్ అనంతరం పట్టణంలోని మూడు మసీదులకు చెందిన జమాత్ వారు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మున్సిపల్ సెంటర్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించి, అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. కేంద్ర ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముస్లిం పెద్దలు ఎండీ ముక్తార్ ఆలీ, ఎండీ ముస్తఫా మాట్లాడుతూ, బీజేపీ సవరించిన ఈ చట్టం ఆస్తులను కబ్జా చేయడానికే మినహా, వక్ఫ్ అభివృద్ధికి కాదన్నారు. దుర్మార్గమైన సవరణలు చేస్తూ, ముస్లింల ఆస్తులపై యుద్ధం ప్రకటించే వివిధ పార్టీలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం బలపర్చడంతో ఈ బిల్లు ఆమోదం పొందిందన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం అధికార దాహంతో భిన్నత్వంలో ఏకత్వంలా మెలిగే భారతీయుల మధ్య మతం పేరుతో ఐక్యత దెబ్బతీస్తోందని మండిపడ్డారు. భారతీయ ముస్లింల మనోభావాలను, హక్కులను కాలరాస్తూ చేసిన వక్ఫ్ సవరణ చట్టాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బిల్లు వెనక్కి తీసుకునే వరకు ముస్లింలకు మద్దతిచ్చే ప్రతి ఒక్కరితో కలిసి ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని, ఆర్డీఓ శ్రీరమణికి వినతిపత్రం అందజేశారు. ఈ ఆందోళనకు సీపీఎం పెద్దాపురం పట్టణ కమిటీ మద్దతు తెలిపింది. ఈ కార్యక్రమంలో నాయకులు ఆసిఫ్ ఆలీ, సయ్యద్ ఖాదర్, షేక్ గౌస్, ఎంఎల్ ఆలీ, సయ్యద్ జానీ, నవాబ్ జానీ, మక్బూల్ జానీ, రజాక్, బాబూలాల్, నబీ, షరీఫ్, లాల్, నజీర్, రిజ్వాన్, షబ్బీర్, సీపీఎం నాయకులు నీలపాల సూరిబాబు, సిరిపురపు శ్రీనివాస్, డి.క్రాంతికుమార్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎంపీ సతీష్‌బాబు



మెగా జాబ్‌మేళాను ప్రారంభిస్తున్న ఎంపీ, కలెక్టర్

పెద్దాపురం: యువత వికాస ద్వారా అందిస్తున్న మెగా జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, ఎంపీ సానా సతీష్ బాబు అన్నారు. స్థానిక మహారాణి కళాశాలలో శుక్రవారం వికాస ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అధ్యక్షత వహించారు. కలెక్టర్, ఎంపీ మాట్లాడుతూ, 35 కంపెనీల నుంచి 1,121 ఉద్యోగాలకు అవకాశం కల్పించినట్టు చెప్పారు. వికాస ద్వారా పది వేల ఉద్యోగాలు ఇచ్చినట్టు వివరించారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, కుడా చైర్మన్ తుమ్మల బాబు మాట్లాడుతూ, యువత ఉపాధి అవకాశాలును సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలుత ఎంపీ, కలెక్టర్ జ్యోతిప్రజ్వలన చేసి జాబ్‌మేళాను ప్రారంభించారు. జ్యోతిరావ్ పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వికాస పీడీ లచ్చారావు, ఆర్డీఓ శ్రీరమణి, డీఎస్పీ శ్రీహరిరాజు, ఎంపీడీఓలు శ్రీలలిత, హిమమహేశ్వరి, ఈఓపీఆర్డీ తోట సత్తిబాబు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కనుల విందుగా అమ్మవారి తెప్పోత్సవం



కోనేరులో నిర్వహిస్తున్న తెప్పోత్సవం



ఆకట్టుకున్న వేషధారణలు

బోట్‌క్లబ్: కల్యాణోత్సవాల్లో భాగంగా స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి తెప్పోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన పడవలో ఉంచి, ఆలయ కోనేరులో మూడుసార్లు ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. గరగల నృత్యం, చెండై మేళం, కోలాటం అలరించింది. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ కోనేరు ప్రాంతం కిటకిటలాడింది. తొలుత తెప్పోత్సవాన్ని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ప్రారంభించారు. ఆలయ ఈఓ ఉండవల్లి వీర్రాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

‘పంటను స్వాధీనం చేసుకుంటాం’

కొత్తపల్లి: పేదల ఇళ్ల స్థలాల కోసం గత ప్రభుత్వం సేకరించిన భూముల్లో అక్రమంగా సాగు చేసిన పంటను ప్రభుత్వపరంగా స్వాధీనం చేసుకుంటామని డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, మండలంలోని కొమరగిరి శివారు ఆనంద్‌నగర్ సమీపంలో పేదల ఇళ్ల స్థలాల కోసం గత ప్రభుత్వంలో సుమారు 71 ఎకరాల భూమిని సేకరించినట్టు చెప్పారు. సుమారు 31 ఎకరాలు ఇళ్ల స్థలాలకు మెరక కాలేదన్నారు. ఆ భూమిని అక్రమంగా 19 మంది సాగు చేస్తున్నారని, వారికి నోటీసులు ఇచ్చామని చెప్పారు. పంటను స్వాధీనం చేసుకోవడం లేదా, నిర్దేశిత రుసుము చెల్లిస్తే అప్పగిస్తామని వివరించారు. ప్రభుత్వ భూమిలో సాగు చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు.

మహాత్మా జ్యోతిరావు పూలే కృషి చిరస్మరణీయం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వంగా గీత, నాయకులు



వైఎస్సార్ సీపీ సామర్లకోట కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దొరబాబు తదితరులు

పిఠాపురం: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన కృషి చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అవిశ్రాంత కృషి చేసిన మహనీయులు, ప్రముఖ సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో కలసి ఆమె పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహాత్మా జ్యోతిరావు పూలే స్త్రీ విద్య కోసం ఎంతో కృషి చేశారన్నారు. పేదలు ఉన్నత స్థాయికి ఎదగాలంటే విద్యతోనే సాధ్యమని చెప్పిన ఏకైక వ్యక్తి పూలే అని కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేద విద్యార్థుల కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తే, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బడుల్లో ఇంగ్లిష్ విద్యను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో చదివే స్థోమత లేని పేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లోనే అత్యుత్తమ విద్య అందించేలా కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు గండేపల్లి బాబి, పట్టణ, కొత్తపల్లి పార్టీ అధ్యక్షులు రావుల మాధవరావు, ఆనాల సుదర్శన్, పార్టీ నాయకులు తలిశెట్టి వెంకటేశ్వరావు, వజ్రపు బాబీ, ఉలవల భూషణం, బొజ్జారామయ్య, పచ్చిమళ్ల అప్పలరాజు, పలువురు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

సామర్లకోట: సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అయ్యరక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. స్త్రీలు, అణగారిన వర్గాల వారి హక్కుల పరిరక్షణ కోసం అనేక ఉద్యమాలను నిర్వహించారని కొనియాడారు. కుల వ్యవస్థను ఖండిస్తూ, సమాజ శ్రేయస్సు కోసం హేతుబద్ధమైన ఆలోచన వ్యాప్తి కోసం కృషి చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, పెద్దాపరం, సామర్లకోట మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొని పూలేకు నివాళులర్పించారు.



గొల్లప్రోలులో నివాళులర్పిస్తున్న మండల పరిషత్ సిబ్బంది



పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాలలో..

ఎంపీడీఓ కార్యాలయంలో..

పూలే జయంతి కార్యక్రమం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు ఆధ్వర్యంలో జరిగింది. కార్యాలయ ఆవరణలో ఉన్న పూలే విగ్రహానికి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి పూలే ఎనలేని సేవలందించారని సత్తిబాబు కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి అవిశ్రాంత కృషి

పిఠాపురం: వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అవిశ్రాంతంగా కృషి చేసిన మహనీయులు, ప్రముఖ సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని శుక్రవారం పిఠాపురం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. గొల్లప్రోలు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె స్వప్న, ఏవో ఎ.వెంకట రామలక్ష్మి, ఈఓపీఆర్డీ సాగర్‌కుమార్, సిబ్బంది, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు పూలే విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. మహిళల్లో అక్షరాస్యత కోసం ఉద్యమం చేపట్టిన మహోన్నత వ్యక్తి పూలే అని ఎంపీడీఓ స్వప్న కొనియాడారు. ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాలలో ప్రిన్సిపాల్ వి.కేశవరావు, ఎన్ఎస్ఎస్ పీఓ కాశీవిశ్వనాథం, అధ్యాపకులు కలిసి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

పెద్దాపురం: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో పూలే జయంతిని సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నీలపాల సూరిబాబు అధ్యక్షతన జరిగిన జయంతి సభలో ఐద్వా కన్వీనర్ కూనిరెడ్డి అరుణ మాట్లాడుతూ, దేశ తొలి సామాజిక విప్లవకారుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. దేశంలో మొట్టమొదటి మహిళా పాఠశాలను ఏర్పాటు చేయడంలో ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దారపురెడ్డి సత్యనారాయణ, కేదారి నాగు, మాగాపు నాగు, రొంగల వీర్రాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. స్థానిక రామారావుపేటలోని బీజేపీ కార్యాలయంలో పూలే జయంతి నిర్వహించారు.